క్లుప్తంగా

జ్ఞాన మార్గాన్ని బోధించేది 'భగవద్గీత'



విజయవాడకల్చరల్: జ్ఞానమార్గాన్ని బోధించేది భగవద్గీత అని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అంబటిపూడి రాధేశ్యాం అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో ఆదిశంకరుల విరచిత భగవద్గీత భాష్య ప్రవచనాలు భక్తిగా సాగుతున్నాయి. గురువారం రాధేశ్యాం కర్మ సన్యాశయోగం అంశంగా ప్రసంగించారు. ఆదిశంకరులు లోక కల్యాణార్థం అనేక గ్రంథాలను రచించారని తెలిపారు. మానవాళికి ముక్తిని ప్రసాదించే భగవాన్ శ్రీ కృష్ణుడు మనకు అందించిన భగవద్గీతకు భాష్యం రచించారన్నారు. కర్మలను త్రికరణ శద్ధిగా ఆచరించాలని సూచించారు. దానికి మనోధైర్యం, ఆత్మజ్ఞానం కలిగి ఉండాలని పేర్కొన్నారు. కర్మయోగం ద్వారా మోక్షం పొందవచ్చునని తెలిపారు. అనంతరం వేదపండితుడు వీరుభట్ల ఫణికుమార శర్మ రాధేశ్యాంను సత్కరించారు.

ఔషధాలపై జీఎస్టీ తగ్గింపు



పాయకాపురం(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీతో మందుల ధరలు తగ్గాయని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి తెలిపారు. గురువారం శాంతినగర్‌లోని సచివాలయంలో జీఎస్టీ రాయితీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూపీహెచ్‌సీ డాక్టర్ ఖాజా ఇంతియాతుల్లా మాట్లాడుతూ మందులపై జీఎస్టీ తగ్గింపు ఎంత శాతం ఉందనేది వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సెక్షన్ 30 అమలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 10 నుంచి వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ వరకు సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో జారీ చేశారు. ఈ నిషేధాజ్ఞలు అమలు ఉన్న సమయంలో ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని తెలిపారు. నిషేధాజ్ఞలు అతిక్రమించి నిర్వహించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాబా సేవలో సింగర్ శ్రీలలిత దంపతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలోని బాబావారిని ప్రముఖ సింగర్ శ్రీలలిత దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. అనంతరం ఆలయ అర్చకులు బాబావారి శేషవస్త్రంతో శ్రీలలిత, గుడిపాటి సీతారామ్ దంపతులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరు పండరీపురానికి చెందిన గుండ లక్ష్మీనారాయణ, ప్రభావతమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116ల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందించారు.

కళావిహీనంగా కాల్వ గట్లు

- ప్రకటనలకే పరిమితమైన సుందరీకరణ
- తూతూమంత్రంగా ఫెన్సింగ్
- అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్ పనులు



మధురానగర్ కాలువగట్టుపై పిచ్చిమొక్కలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాలువ గట్ల సుందరీకరణ కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యింది. సుందరీకరణ పేరిట అంబేడ్కర్ కాలనీ నుంచి మధురానగర్ పప్పులమిల్లు సెంటర్ వరకు కాలువ పక్కన నివాసాలను తొలగించారు. అయితే ఇళ్లు తొలగించిన ప్రాంతాన్ని మాత్రం సుందరీకరణ చేయలేదు. కాలువల గట్టును పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా.. అధ్వానంగా మారాయి. అంబేడ్కర్ కాలనీలో అయితే కాలువ పక్కన పశువుల మేత డంపింగ్ చేయడంతో పాటు వాటిని పెంచుతున్నారు. అలాగే కాల్వగట్టున వేసిన పెన్సింగ్‌ను సైతం కొంతమేర తొలగించారు. దీంతో ఇక్కడ పచ్చటి చెట్లతో సుందరంగా ఉండాల్సిన కాల్వగట్లు చెత్తచెదారం, పశువుల వ్యర్థాలతో అపరిశుభ్రంగా దుర్వాసన వెదజల్లుతున్నాయి.

ఆలయాల పేరుతో ఆక్రమణలు

మధురానగర్ నుంచి పప్పులమిల్లు సెంటర్ వరకు కాల్వగట్టు ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ వేస్తామని అధికారులు ప్రకటించారు. ఇందుకుగానూ కొంత మేర పనులు కూడా జరిగాయి. ఆ తర్వాత వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఎవరికి వారు ఆక్రమణలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ శ్రీ కృష్ణ మందిరం నిర్మించారు. తర్వాత గోశాలను కూడా నిర్మించారు. అయితే అధికారులు గోశాలను కూల్చివేయగా ఇటీవల తిరిగి అధికార పార్టీ నేతల అండదండలతో గోశాల షెడ్డును పునర్నిర్మించారు. ఈ ప్రాంతంలో ఎవరికి వారు ఆలయాల పేరిట ఆక్రమణలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాలువ గట్లను సుందరీకరించి వాకింగ్ ట్రాక్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక మొక్కను కూడా నాటలేదు

ఆక్రమణలకు గురికాకుండా కాల్వగట్టు ప్రాంతంలో ఫెన్సింగ్ వేయాలని నగర కమిషనర్ అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు మాత్రం ఫెన్సింగ్ పనులను తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకొన్నారు. విశాలంగా ఉన్న కాలువగట్లపై కనీసం ఒక మొక్కను కూడా నాటలేదు. దీంతో ఈ ప్రాంతాలు చెత్తచెదారం, పిచ్చి మొక్కలు పెరిగిపోయి క్రిమికీటకాలు, దోమలు, విషసర్పాలకు ఆవాస కేంద్రంగా మారాయి. కొన్ని చోట్ల ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో స్థానికులు కాలువగట్టు లోపల తమ వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి కాల్వగట్లు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకొని, వాటిని సుందరీకరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అంబేడ్కర్ కాలనీలో పెన్సింగ్ వద్ద పరిస్థితి



అంబేడ్కర్ కాలనీలో కాలువగట్టు దుస్థితి

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తలపెట్టిన వైద్యకళాశాలల ప్రైవేటీకరణ, కూటమి వైఫల్యాలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో గురువారం నియోజకవర్గ పరిశీలకుడు సార్థాల తిరుపతిరావు అధ్యక్షతన పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు డివిజన్ స్థాయిలో కలిసిమెలసి స్థానిక సమస్యలను గుర్తించడంతో పాటు సంతకాలు సేకరించాలని సూచించారు. అలాగే వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వల్ల రాష్ట్రానికి జరిగే అన్యాయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. 45 రోజుల పాటు ఉద్యమ స్ఫూర్తితో వైఎస్సార్ సీపీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు కలిసి మెలసి కోటి సంతకాలు సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

తాను ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని.. ప్రతి డివిజన్‌కు వస్తానని మల్లాది విష్ణు తెలిపారు. శుక్రవారం నుంచి కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈనెల 12వ తేదీన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన, 28న సెంట్రల్ నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సేకరించిన సంతకాలను వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందజేసి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సుందర్‌పాల్, కార్పొరేటర్లు, నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి లేపాక్షి శిల్ప బజార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ హస్త కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్థానిక పటమట ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఈనెల 10 నుంచి 19వ తేది వరకు లేపాక్షి గాంధీ శిల్ప బజార్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు లేపాక్షి చైర్మన్ డా. పి.హరి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. విశ్వ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనను శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఏపీ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ బీసీ వెల్ఫేర్ శాఖా మంత్రి ఎస్. సవిత ప్రారంభిస్తారని తెలిపారు. ప్రాచీన హస్త కళలు భారతీయ సంస్కృతి సంప్రదాయలు ఉట్టిపడేలా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు రూపొందించిన ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్ ద్వారా ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషన్ సహకారంతో నిర్వహించే ఈ బజార్‌లో కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్థాన్, మహారాష్ట్ర, బిహార్, ఒరిస్సా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పంజాబ్ తదితర రాష్ట్రాలతో పాటు ఏపీలో పేరుగాంచిన హస్త కళా ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. ప్రదర్శనలో కలంకారి, ప్రింటింగు, పెయింటింగులు, కొండపల్లి, ఏటికుప్పాక బొమ్మలు, లేసు అల్లికలు, చెక్కతో తయారైన కళాకృతులు, టెర్రకోటపాటరీలు, తాటియాకు వస్తువులు, తివాచీలు, కేన్ వస్తువులు, మంగళగిరి చీరాల చేనేత వస్త్రాలు, హైదరాబాద్ ముత్యాలు, బ్లాక్ మెటల్ వస్తువులు, ఉడెన్ కట్లరీ వస్తువులు నిర్మల్ పెయింటింగ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన చికన్ ఎంబ్రాయిడరీ, గాజు ఆభరణాలు, మధుబని పెయింటింగ్స్, బ్లూ పాటరీ వస్తువులు, చిత్రపటాలు, సిల్వర్ పిలిగ్రీ, లక్క గాజులు, డోక్రా కేస్టింగ్, డ్రై ఫ్లవర్స్ వంటి అనేక కళారూపాలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు.

శ్రీదత్తసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాబావారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబా వారికి పంచామృత అభిషేకం, విశేషంగా పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డుపై నిలిచిన వర్షంనీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): సత్యనారాయణపురం రాజేశ్వరి వీధి, రైల్వేకాలనీ రోడ్డు, డీమార్ట్ సమీపంలోని బావాజీ పేట, ముత్యాలంపాడు జెండా చెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో బుధవారం కురిసిన వర్షానికి వర్షంనీరు రోడ్లపై నిలిచిపోయింది. దీంతో ఇక్కడ వర్షం పడితే నీరు పోయే దారి లేదని స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ సాక్షి 'రోడ్లపై నిలిచిన వర్షంనీరు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన వీఎంసీ అధికారులు రోడ్డుపై నిలిచిన వర్షంనీటిని తొలగించారు. అయితే వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచిపోకుండా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళల్లో అంతర్లీనంగా ఎంతో శక్తి దాగుంటుందని, ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టించగలరని ప్రముఖ వెల్‌నెస్ మెంటార్ ప్రియ మోహన్ రాజీవ్ తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం ఫిక్కీ ఫ్లో చాప్టర్ ఆధ్వర్యంలో మహిళలు – సవాళ్లు, ఉన్నత శిఖరాలు అధిరోహించడం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రియ మోహన్ రాజీవ్ మాట్లాడుతూ.. మహిళలు నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతుంటారని ఒత్తిడిని అధిగమిస్తే జీవితంలో ముందుకు సాగుతారన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నా, కొన్నిచోట్ల వివక్షకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమ్రిత కుమారి, సీనియర్ వైస్ చైర్ పర్సన్ సుప్రియ మలినేని, ప్రతినిధులు రజనీ చిత్రసుమ అట్లూరి, దీప్తి చలసాని, తులజా దేవినేని పాల్గొన్నారు.

ఇమామ్‌లకు జీతాలు మంజూరు చేయండి



నియామక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): నూతనంగా నిర్మించిన మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు జీతాలు మంజూరు చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. గురువారం కండ్రికలోని రాష్ట్ర కార్యాలయంలో సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది మసీదుల్లో ఇమామ్, మౌజన్‌లుగా జీతాల్లేకుండా పని చేస్తున్నారని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్ల ప్రస్తావన తీసుకురావడం లేదన్నారు. అనంతరం ఏఎంసీ సెంట్రల్ నియోజకవర్గ యూత్ కార్యదర్శిగా అబ్దుల్ అలీమ్‌కు నియామక పత్రం అందజేశారు. సెంట్రల్ యూత్ అధ్యక్షుడు ఎండీ సూరజ్ బాష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలాన సాజిద్‌అలీ, అధికార ప్రతినిధి సిలార్ బేగ్, యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సెక్యులర్, సోషలిస్ట్ పదాలు తొలగిస్తే సహించం

ఏబీబీఎస్పీ జాతీయ సమన్వయకర్త పూర్ణచంద్రరావు



ధర్నా చౌక్‌లో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సభలో ఏబీబీఎస్పీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగిస్తే ఊరుకునేది లేదని ఏబీబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, ఏపీ మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు హెచ్చరించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం ఏబీబీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ సభ జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలకులు రాజ్యాంగాన్ని అమలు పరచడం లేదన్నారు. భారీ ఎత్తున ప్రైవేటీకరణ చేయడానికి సోషలిజం అనే పదాన్ని రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించడానికి పూనుకొందన్నారు. అలాగే సెక్యులరిజం పదాన్నీ తొలగించాలని ప్రయతిస్తోందని, ఇలాంటి ధోరణులను అరికట్టడానికి అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైతే దేశ వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. ఏబీబీఎస్పీ అన్ని వర్గాలనూ కలుపుకొని రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని చేపడుతుందని పేర్కొన్నారు. సభలో ఏబీబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్కా పరంజ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడు లకే రాజారావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు భీమేశ్వరి, రాష్ట్ర అధికార ప్రతినిధి పాల్, ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి శ్రీనివాస్ పానుగుపాటి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సప్తశక్తి సంగం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15 నుంచి 2026 జనవరి 23వ తేది వరకు విద్యా భారతి అఖిల భారతీ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యాన విద్యాభారతి నిర్వహించే పాఠశాలల్లో సప్తశక్తి సంగం విశిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుంటూరు టీజేపీఎస్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.రాధాబాయి తెలిపారు.

గురువారం సత్యనారాయణపురంలోని శిశు విద్యా మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 450 సప్తశక్తి సంగమాలు నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లక్షా యాభైవేలమంది మాతృమూర్తులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచ పరివర్తన గురించి బోధించడం జరుగుతుందని చెప్పారు. పర్యావరణం, సమరసత, నాగరిక బాధ్యత, ఉమ్మడి కుటుంబాలు, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను శాస్త్రీయమైన విధానంలో బోధించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళలు శిబిరంలో ఉచితంగా శిక్షణ తీసుకోవచ్చునని తెలిపారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయని సీతామహాలక్ష్మి, విజ్ఞాన విహార్ పాఠశాల అధ్యాపకురాలు లలిత పాల్గొన్నారు.

కర్మల భవన నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన కర్మల భవన నిర్మాణానికి నగర పాలకసంస్థ కౌన్సిల్ ఆమోదం లభించిందని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు. గురువారం సత్యనారాయణపురంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సుమారు 40 ఏళ్ల క్రితం సత్యనారాయణపురం, జీఎస్ రాజురోడ్డులో ఏర్పాటు చేసిన కర్మల భవనం శిథిలావస్థకు చేరుకుని, అందులోని షెడ్లు, నిర్మాణాలు కూలిపోయాయని అన్నారు. దీంతో ఈ ప్రాంత నివాసితుల్లో ఎవరైన మృతిచెందితే వారికి ఖర్మఖాండలు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. దీనిపై అనేక సార్లు, వీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టడం జరిగిందన్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో వీఎంసీ నిధుల నుంచి కర్మల భవన నిర్మాణం చేపట్టేందుకు ఆమోదం లభించిందని తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వర్షంనీరు రోడ్లపై నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం



పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వర్షం నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారాన్ని తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, ఆటోనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వర్షం పడిన కాసేపటికే పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులో నీటి నిల్వలు ఉంటున్నాయని, పలుమార్లు డిసిల్టింగ్ పనులు ఎన్ని చేసినప్పటికీ రోడ్డుపై నీరు నిల్వ ఉంటుందన్నారు. స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ కన్సల్టెంట్స్‌తో దీనికి ఒక శాశ్వత పరిష్కారాన్ని అందించాలని కమిషనర్ చెప్పారు. డ్రెయిన్ల ప్రవాహానికి అడ్డొచ్చే ఆక్రమణలను, ఇరుకైన మార్గాలను తొలగించి, కాల్వలను వెడల్పు చేసే ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వర్షం పడినప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నీటి నిల్వలు రోడ్డుపైన ఉండకుండా శరవేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటి వరకు మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లను అప్రమత్తంగా ఉంచుతూ వర్షంనీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

ఆటోనగర్‌లో గార్బేజ్ స్టేషన్‌లో పార్కింగ్‌కు చర్యలు

అనంతరం ఆయన ఆటోనగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. సర్కిల్–3లోని వ్యర్థాలు సేకరించే ఆటోలు, సర్కిల్–2 అజిత్ సింగ్‌నగర్‌లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వెళ్లి రెండో ట్రిప్‌కు వచ్చి వ్యర్థాలు సేకరించేందుకు ఆలస్యమవుతోందని అధికారులు కమిషనర్‌కు తెలిపారు. సర్కిల్–3లో సేకరించే వ్యర్థాల క్లాప్ వాహనాలు అక్కడే నిలుపుకొనేందుకు ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పార్కింగ్ చేసే చర్యలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు



వించిపేట(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు చేకూరే ప్రయోజనాల గురించి ప్రభుత్వం ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ మాధవి, జీఎస్టీ డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్వీఎస్వై భరత్ ఆధ్వర్యంలో గురువారం షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ హాస్పిటల్‌లో జీఎస్టీపై అవగాహన కల్పించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు గురించి ప్రజలకు, రోగులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రోగులకు ఉపయోగంగా ఉండే వైద్య పరీక్షలు, పరికరాలు, ఔషధాలు తదితరాలపై తగ్గించిన జీఎస్టీని రోగులకు వివరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ, వైద్యులు, వైద్య సిబ్బంది, కొత్తపేట టీవీ యూనిట్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు సత్కారం



కమిషనర్ ధ్యానచంద్రను అభినందిస్తున్న నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర, జిల్లా స్థాయిలో నగరానికి స్వచ్ఛత అవార్డులు తీసుకురావడంలో విశేష కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంను విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ), మినిస్ట్రియల్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్తంగా అభినందించి చిరు సత్కారం చేసింది. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను గురువారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన యూనియన్, అసోసియేషన్ సభ్యులు మొక్కను అందించి, సత్కారం చేశారు. నగరానికి పలు అవార్డులు తీసుకురావడమే కాకుండా దసరా ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా శానిటేషన్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించడంలో నిర్విరామంగా పని చేసి ఉత్సవాలను జయప్రదం చేయడంలో కీలక పాత్ర పోషించటం హర్షణీయమని ధ్యానచంద్రను కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షుడు ఎస్‌పీఎస్ చలం, అసోసియేషన్ అధ్యక్షుడు దారా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కంప్యూటర్ శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరురోడ్డు, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ కోర్సులకు నూతన బ్యాచ్‌లు ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కంప్యూటర్ విభాగం బాధ్యుడు టి.క్రాంతికిరణ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 90145 41958, 94900 98042 లేదా ఎం.బి.విజ్ఞాన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.